క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

మనుబోలు: స్థానిక గిరిజనకాలనీకి చెందిన కందుకూరు శ్రీనివాసులు ఇటీవల పాముకాటుకు గురవడంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి బాధితుడికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశాడు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆట వస్తువులు బహూకరించారు. కార్యక్రమంలో ఆంధ్ర చెఫ్ అధినేత బొల్లు రాంప్రసాద్, హెచ్‌ఎం డేవిడ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్బీకేలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మనుబోలు: స్థానిక రైతుభరోసా కేంద్రాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఎరువులకు సంబంధించి నిల్వల రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆర్బీకే నుంచి రైతులకు అందాల్సిన సేవలు సక్రమంగా అందుతున్నాయా అని రైతులను ఆరా తీశారు. అధికారుల పనితీరు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. తాము పరిశీలించిన విషయాలపై నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పెంచలరెడ్డి, ఏఓ జహీర్, వీఏఏ తేజస్విని, హెచ్‌సీలు బాజీ, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



ముత్తుకూరు: ముత్తుకూరులో రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా సర్వేపల్లి, వెంకటాచలం జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ పనులను ఆర్‌అండ్‌బీ చేపట్టింది. ఇందులో భాగంగా ముత్తుకూరు, సర్వేపల్లిలో ఆక్రమణలు తొలగించి రోడ్డును విస్తరించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రూ.12 కోట్లతో ప్రధాన రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నట్లు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

వవ్వేరులో ఉచిత వైద్య శిబిరం



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరులో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నెల్లూరులోని కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో గ్రామానికి చెందిన 120 మంది రోగులకు వైద్యసేవలను అందించారు. అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వైద్యుడు అఫ్రిద్ మాట్లాడారు. శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన కౌన్సిలర్ లలితారెడ్డిని అభినందించారు. శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో వినియోగదారులకు రేషన్ బియ్యాన్ని మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలోని మసీదు వీధిలో 35 మంది కార్డుదారులకు గడువు దాటిపోయిందని రేషన్ సరుకులను అందించని విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుబ్బయ్య వారికి బియ్యం అందేలా చర్యలు చేపట్టారు. వీఆర్వో వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు జనార్దన్‌రెడ్డి, ఫణీంద్రనాయుడు, షబ్బీర్, సర్పంచ్ నిరంజన్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పొదలకూరు: పట్టణంలోని రామనగర్ గేట్ సెంటర్‌లో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పొదలకూరు ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు మందా ఈశ్వరయ్య అనే వ్యక్తి అక్రమంగా 16 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నం

- ప్రజలు తిరస్కరిస్తున్నా సోమిరెడ్డికి బుద్ధిరాలేదు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రామాపురంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు మూడు పర్యాయాలు తిరస్కరించినా బుద్ధిరాలేదని, అభివృద్ధిని అడ్డుకునేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని దుగ్గుంట సచివాలయ పరిధిలోని దుగ్గుంట, రామాపురం, కొనగలూరు గ్రామాల్లో మంగళవారం మంత్రి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను ప్రజలకు అందజేసి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేస్తే అవినీతి జరిగిందని, చేయకుంటే చేయలేదంటూ సోమిరెడ్డి విమర్శలకు దిగడం అలవాటు చేసుకున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి ప్రతిపక్ష నాయకుడు సర్వేపల్లి నియోజకవర్గంలో ఉండడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వంపై ఏదో ఒక విధంగా బురద చల్లాలని చూస్తున్నారని, అయితే ప్రజలు వారిని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, సైడ్ డ్రెయిన్లను నిర్మించినట్లు తెలిపారు. మెట్టప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కిందన్నారు. ఈ ప్రాంతానికి కండలేరు ఒకటో నంబరు బ్రాంచ్ కాలువ ద్వారా సాగునీటిని అందజేయాలంటే గగనమయ్యేదని, ప్రస్తుతం ఎలాంటి అడ్డంకులు లేకుండా రైతులకు సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ఆకర్షితులై టీడీపీ బలంగా ఉన్న పల్లెలు సైతం తమ వెంట నడుస్తున్నాయని తెలిపారు.

కొనగలూరులో ప్రారంభోత్సవాలు

దుగ్గుంట సచివాలయం పరిధిలోని కొనగలూరులో రూ.26 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్లు, రూ.40 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లను మంత్రి కాకాణి ప్రారంభించారు. సూరాయపాళెం, మొగళ్లూరు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో కొత్తగా నియమితులైన వలంటీర్లకు మంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం చినబ్రహ్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, సర్పంచ్ వెంకటరమణయ్య, నాయకులు మోహన్‌రాజు, లెక్కల పెంచలనాయుడు, ఎం.సుందరయ్య, చంద్రయ్య నాయుడు, ఎం.జనార్దన్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేతో మంత్రి కాకాణి మాటామంతి



మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో ముచ్చటిస్తున్న మంత్రి కాకాణి

ముత్తుకూరు: సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే ఈదూరు రామకృష్ణారెడ్డిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించి కొద్దిసేపు ముచ్చటించారు. ముత్తుకూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మంత్రి కాకాణి ప్రతి కుటుంబాన్ని కలుసుకొనే క్రమంలో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఇంటికి కూడా వెళ్లారు. ఈ సందర్భంగా 1985 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా పని చేసిన రామకృష్ణారెడ్డి నాటి రాజకీయ పరిస్థితులను, అనుభవాలను మంత్రితో పంచుకున్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా అలుపెరుగక పర్యటిస్తున్న మంత్రిని అభినందించారు.

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని గుంటూరుకు చెందిన విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, కుటుంబసభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శేషవస్త్రాల తో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ దిలీప్ పాల్గొన్నారు.

షటిల్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక

పొదలకూరు: పట్టణంలోని వినాయక షటిల్ క్లబ్ నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, అధ్యక్షుడిగా చాట్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులుగా బూసుపల్లి నారాయణరెడ్డి, చింతక్రింద హరికృష్ణ, కార్యదర్శిగా శ్రీధర్, జాయింట్ కార్యదర్శిగా అచ్చాల శేషారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రమేష్, ట్రెజరర్‌గా విజయభాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

గాయపడిన వ్యక్తి మృతి

ముత్తుకూరు: మండలంలోని ముసునూరువారిపాళెం పంచాయతీ కొత్తపాళెంలో మంగళవారం తెల్లవారుజామున కారు ఢీకొన్న ఘటనలో గాయపడిన వృద్ధుడు మృతిచెందాడు. ముత్తుకూరు పోలీసుల కథనం మేరకు గుర్తుతెలియని వ్యక్తి కారు రివర్స్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు ఢీకొన్న ఘటనలో వెంకటసుబ్బయ్య(75), మరో ఇద్దరు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వెంకటసుబ్బయ్యను మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు అభినందన

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు జాతీయ స్థాయిలో స్విమ్మింగ్, ఖోఖో, రెజ్లింగ్‌లో బహుమతులను సాధించారు. అదే విధంగా పలువురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని బహుమతులను దక్కించుకోవడంతో వీరిని పాఠశాలలో మంగళవారం అభినందించారు. బుచ్చిరెడ్డిపాళెం సీఐ రామారావు, కొడవలూరు ఎస్సై సుబ్బారావు అభినందనలను తెలిపారు. ప్రిన్సిపల్ విష్ణుప్రియ, పీడీ సౌజన్య, పీఈటీ యశోధ పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికితీయండి

బుచ్చిరెడ్డిపాళెం: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయాలని ఎంఈఓ దిలీప్ పేర్కొన్నారు. ఖేలో ఇండియా ఫిట్‌నెస్ అసెస్‌మెంట్ యాప్‌పై మండల, జిల్లా కోఆర్డినేటర్లకు ఒక రోజు శిక్షణ తరగతులను మండలంలోని పెనుబల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విష్వక్సేన ఆరాధన, శుద్ధి పుణ్యాహవచనం, అభిషేకం, హారతి, తీర్థప్రసాద వినియోగం, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి ఆలయ ప్రవేశం, భగవత్ ప్రార్థన, శుద్ధి పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, మేదినీపూజ, అంకురార్పణ పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ బి.మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్యస్వామి పాల్గొన్నారు.

నాటుసారా నిల్వలపై తనిఖీలు



కార్డన్ సెర్చ్‌కు సిద్ధమవుతున్న పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు

పొదలకూరు: నాటుసారా తయారీ గ్రామాలుగా గుర్తింపు ఉన్న మండలంలోని బిరదవోలు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున సీఐ జి.సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరిముల్లా, ఎస్‌ఈబీ సీఐ సీహెచ్ శ్రీనివాసులు నాటుసారా నిల్వలపై కారన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్‌ఈబీ అధికారులు బిరదవోలు, బ్రాహ్మణపల్లి గ్రామాలను దత్తతగా స్వీకరించి నాటుసారా తయారీకి గ్రామస్తులను దూరంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మహిళల సహకారం అవసరమని ఈ సందర్భంగా పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు తెలిపారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

- అదనంగా 30 లక్షల పని దినాలు
- డ్వామా పీడీ వెంకట్రావ్



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావ్

పొదలకూరు: గ్రామాల్లో అడిగిన ప్రతి ఒక్కరికీ పనికల్పించేలా ఎఫ్‌ఏలు, టీఏలు కృషి చేసి లక్ష్యాలను అధిగమించాలని డ్వామా పీడీ వెంకట్రావ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పొదలకూరు, చేజర్ల మండలాల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గత డిసెంబరు వరకు జిల్లాకు 80 లక్షల పనిదినాలు కేటాయించినట్లు తెలిపారు. అయితే ప్రభుత్వం అదనంగా మరో 30 లక్షల పనిదినాలను కల్పించినట్లు పేర్కొన్నారు. చేజర్ల మండలంలో రోజుకు 2,500 కూలీలు లక్ష్యం కాగా కేవలం 1,299 కూలీలే పనులకు వస్తున్నారని, పొదలకూరు మండలంలో 3,500 కూలీలు లక్ష్యం కాగా 1,450 మంది కూలీలే పనులకు వస్తున్నట్లు తెలిపారు.

రూ.257 కూలీ ఇవ్వగలగాలి

జిల్లాలో ఉపాధి హామీ పనికి వచ్చే ప్రతి కూలీకి సగటున రూ.257 ఇవ్వగలితే మెటీరియల్ కాంపోనెంట్ రూ.125 వస్తుందని పీడీ తెలిపారు. ఇందువల్ల గ్రామాల్లో మెటీరియల్ కాంపోనెంట్ పెరగాలంటే కూలీల సగటు కూలీ పెరగాలన్నారు. సమావేశంలో ఏపీడీ శ్రీహరిరెడ్డి, ఏపీఓ మధుసూదన్ పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ




కోవూరు: పడుగుపాడులోని చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీలో కుట్టు శిక్షణ పొందిన 10 మందికి రూ.65 వేల విలువగల కుట్టు మెషీన్లను నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సేవా చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. అనంతరం డీసీఎంబీ చైర్మన్ నిరంజన్‌బాబు రెడ్డి మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించిన సమయంలో.. కుట్టు మెషీన్లు కావాలని పలువురు కోరారని చెప్పారు. దీంతో వీటిని ఎమ్మెల్యే అందజేశారని పేర్కొన్నారు. డీఎల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఉప సర్పంచ్ అహ్మద్, జెడ్పీటీసీ శ్రీలత, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పడుగుపాడు ఎస్సీ కాలనీలో ఇటీవల ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాసులు, ఈ శ్రీనివాసులు, సుబ్బయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

పొదలకూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ కె.సుబ్బరాయుడు అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలాన్ని నుడా పరిధిలోకి తీసుకువచ్చి 5,100 పక్కా ఇళ్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడా మంచినీటి సమస్యలు తలెత్తకుండా జలజీవన్ మిషన్‌లో మండలానికి రూ.17.50 కోట్లు మంజూరు చేయించి 33 గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి కాకాణి సర్వేపల్లి నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులకు 80 శాతం సబ్సిడీపై వరివిత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్ ఏఈలు కసనానాయక్, ప్రసాద్, భాస్కర్, ఏఓ ఎ.వాసు, హెచ్‌ఓ ఆనంద్, ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి, ఏపీఎం రోజ్‌మేరీ తమ శాఖలకు చెందిన వివరాలను వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, మరో వైస్ ఎంపీపీ సోమా అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పడుగుపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలను ఆరాతీసి పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కొందరు మాయమాటలతో జనాలను ఏమార్చి లబ్ధి పొందాలని యత్నిస్తున్నారని ఆరోపించారు. ఓట్ల కోసం బూటకపు హామీలిచ్చే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. సుపరిపాలన దీర్ఘకాలం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అనంతరం నాడు – నేడులో భాగంగా పడుగుపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.24 లక్షలతో చేపట్టిన పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలో రెండు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన భవనాలను నిర్మించేందుకు సహకారం అందించాలని ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు కోరారు. సాధ్యమైనంత త్వరగా గదులను పూర్తి చేసేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డీసీఎంబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, డీఎల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, సచివాలయాల మండల కన్వీనర్ ప్రసాద్, ఉప సర్పంచ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి సాయం

- సీఎస్సార్ నిధులు రూ.40 లక్షల అందజేత
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మంత్రి కాకాణికి చెక్కును అందజేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు

నెల్లూరు(సెంట్రల్): సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజనులకు మంజూరైన జగనన్న ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం చేసేందుకు పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్సార్ నిధులను ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇమామీ కంపెనీ రూ.20 లక్షలు, సంతోషీమాతా కంపెనీ రూ.10 లక్షలు, కిసాన్ క్రాఫ్ట్ కంపెనీ రూ.పది లక్షల సీఎస్సార్ నిధులను చెక్కుల రూపంలో ఆయా పరిశ్రమల ప్రతినిధులు మంత్రికి నెల్లూరులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదలకు స్థలమివ్వడంతో పాటు ఇళ్లు కట్టించి ఇస్తున్నారని గుర్తుచేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పేద గిరిజనులకు ప్రభుత్వం అందజేస్తున్న రూ.1.8 లక్షల నగదుతో పాటు అదనంగా సీఎస్సార్ నిధుల కింద రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నామని వెల్లడించారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మొత్తం 2700 గృహాలతో పాటు పొదలకూరులో గిరిజనులకు ఇటీవల మంజూరైన 800 ఇళ్ల నిర్మాణాలకు అదనంగా సాయం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పలు పరిశ్రమల యాజమాన్యాలు ముందుకొచ్చి సీఎస్సార్ నిధులివ్వడం శుభపరిణామమన్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు ఇప్పటికే 700 కుటుంబాలకు నిధులను విడుదల చేశారన్నారు. అందరి సహాయ, సహకారాలతో గిరిజనుల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని తెలిపారు. పరిశ్రమల కేంద్ర జీఎం మారుతి ప్రసాద్, డీడీ షఫీ అహ్మద్, హౌసింగ్ పీడీ వెంకటదాస్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష తగదు



బుచ్చిరెడ్డిపాళెంలో అవగాహన ర్యాలీ



కొడవలూరు: యల్లాయపాళెంలో..



ఇందుకూరుపేట: నరసాపురంలో..



మనుబోలు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కొడవలూరు: బాలికలపై తల్లిదండ్రులు వివక్ష చూపడం తగదని.. బాలబాలికలు సమానమేననే భావనను అలవర్చుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడవలూరులోని ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

- యల్లాయపాళెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసూన, మహిళా పోలీసులు మేరీ హెప్సిబా, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.
- నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సాయిదీప్తి, కళాశాల చైర్మన్ బాబునాయుడు, ప్రిన్సిపల్ కుమార్‌బాబు అధ్యాపకులు మెర్సీలిథియా, నర్మద, సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: బాలికల విద్య దేశాభివృద్ధికి మలుపు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం ర్యాలీని జరిపారు. ప్రధానోపాధ్యాయురాలు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లను సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అందజేశారు. నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ దిలీప్, సొసైటీ నిర్వాహకుడు యస్దానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ హేనాసుజన్, సూపర్‌వైజర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: స్థానిక బాలికల వసతి గృహ సముదాయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఎస్సై వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, రాధిక, వసతి గృహ సంరక్షకులు నాగభూషణమ్మ, పద్మజ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను సంరక్షించుకుందాం

మనుబోలు: ఆడ పిల్లలను సంరక్షించుకుందామని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు బాలికా సంరక్షణపై అవగాహన కల్పిస్తూ అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా వంటి వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డేవిడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, రంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చదువు ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి

వెంకటాచలం: తల్లిదండ్రులు తమ బిడ్డల చదువు ప్రాధాన్యతను తెలుసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని కనుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునంద, రంగమ్మ పాల్గొన్నారు.

50 ప్యాకెట్ల గంజాయి అక్రమ రవాణా

వెంకటాచలం: కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని వెంకటాచలం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల మేరకు వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ముందస్తు సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా, నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపు వెళుతున్న రెండు కార్లు ఆపకుండా వెళ్లడంతో పోలీసులు వెంబడించి అడ్డుకున్నారు. ఒక కారు డ్రైవర్ బిక్కి సురేంద్రబాబు కారును వదిలి పరారయ్యాడు. కారులో పోలీసులు పరిశీలించగా, 50 ప్యాకెట్ల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లతోపాటు కారులో ఉన్న విజయవాడకు చెందిన బొమ్మిశెట్టి హరితేజ, బెంగళూరుకు చెందిన హరీష్, నైజీరియా దేశానికి చెందిన లారెన్స్ డొనాట్స్‌లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.